## దళారీలు పుట్టుకొస్తరు..



ఏ భూమి యాడ ఉంది.. ఎవ్వరికీ ఎంత భూమి ఉంది.. మొత్తం భూముల లెక్కలన్నీ ఇట్లే తెలిసిపోయేటట్ల ధరణిని మంచిగ తెచ్చింండ్రు. ధరణి రాకముందు భూమి గురించి ఏం పనిపెట్టుకున్నా ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి సచ్చేటోళ్లం. రాత్రికి రాత్రి ఒకళ్ల నుంచి ఇంకొక్కళ్ల పేరుమీదికి భూమి మారేది. ఎవ్వరు పైసలిస్తే వాళ్ల పనులు చేసెటోళ్లు ఆఫీసర్లు. భూముల సమస్యలతోటి ఎంతోమంది రైతులు శానా ఇబ్బందులు పడుతుండ్రి. ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. సీఎం కేసీఆర్ సారు ధరణిని తెచ్చినంక మనం ఎక్కడ ఉన్నా మన భూమి ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు. ఎవ్వరికీ పడితే వాళ్లకి భూమి మార్చకుండా అయ్యింది. మోసాలు చేయకుండా చేసింది. ఒకే సారి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ నిమిషాల్లోనే అయిపోతుంది. అర్ధగంటల పట్టా కాగితాలు చేతుల పెడుతున్నారు. ఆఫీసర్లు కూడా శానా మంచిగ పనిచేస్తున్నారు. అప్పట్ల నెలలు నెలలు తిరిగినా పనులు చేసేటోళ్లు కాదు. ఇప్పుడేమో ఒకరోజు స్లాట్ బుక్ చేసుకుంటే మరుసటి రోజు పని అయిపోతుంది. భూమి అమ్మాలన్నా.. కొనాలన్నా.. ఏం సమస్యలేకుండా పని జరుగుతుంది. ఆఫీసు చుట్టూ తిరిగే పనికూడా లేకుండానే పని పూర్తైతుంది. గతంలో ఊర్లె సర్పంచ్, ఓ పైరవీకారు, పట్వారీ, ఇంకా ఆఫీసర్ల చుట్టూ తిరిగి, పైసలిచ్చి టైమ్ వేస్ట్ చేసుకునేది. ఇప్పుడెవ్వరితో పనిలేకుండా ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకొని గంటలో పని చేసుకొని బయటికి రావొచ్చు. ఇదంతా ధరణి వచ్చినందుకే ఈజీగా అయితుంది. ధరణి వల్లనే భూములు కూడా భద్రంగా ఉంటున్నాయి. ధరణిని గిట్ల తీసేస్తే మళ్లీ పాతరోజులు వచ్చి దళారీలు వస్తారు. మళ్ల చెప్పులరగ నింకె ఆఫీసుల చుట్టూ తిరగాలె. మళ్లీ భూ సమస్యలు మొదలైతాయి. ధరణి వచ్చినంక ఆఫీసుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగకుండా చేసింది. కాంగ్రెస్సోళ్లకి ఓటేస్తే ధరణి రద్దు చేసి రైతులను ఆగం చేస్తారు. ధరణి ఉండాలంటే కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్ సారునే గెలిపించాలి.

**- రాంరెడ్డి, రైతు, మందిపల్లి గ్రామం, ధన్వాడ మండలం**

## మోసం చేయడానికే కాంగ్రెస్ కుట్రలు



ధరణి తీసేసి రైతులను మోసం చేయడానికే కాంగ్రెస్ కుట్రలు పన్నుతుంది. కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్‌ను తీసేస్తామంటున్నారు. అదే జరిగితే భూ కబ్జాలు పెరిగిపోతాయి. ప్రజలు, రైతులు ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చారు. మీసేవలో స్లాట్ బుక్ చేసుకొని తాసీల్దార్ కార్యాలయానికి వెళ్తే గంటలో రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకుని వెంటనే ఈ-పాసుబుక్‌ను తీసుకుంటున్నాం. ఇంత మంచిగా పని జరుగుతుంటే ఇప్పుడు కాంగ్రెస్ వచ్చి ధరణి తీసేస్తాం అని రైతులను ముంచే మాటలు మాట్లాడుతున్నారు. ధరణితో మా భూముల వివరాలు మా ఖాతాలో భద్రంగా ఉన్నాయి. ఇన్ని చేస్తున్న తెలంగాణ ప్రభుత్వంపై కాంగ్రెస్ కుట్ర పూరితంగా చర్యలు చేపడుతున్నది. ధరణి పోర్టల్‌ను తీసువేసి రైతుల మధ్య ఘర్షణలను పెట్టేందుకు కాంగ్రెస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారు. కాంగ్రెస్ నేతలకు తగిన బుద్ధి చెప్పాలంటే గ్రామాల్లోకి వారిని రానివ్వద్దు.

**- చిన్న సాయిలు, రైతు, సజనాపూర్ గ్రామం, దామరగిద్ద మండలం**

## పొలాల కాడ కాపలా కాయాల్సి వస్తది..

కాంగ్రెసోళ్ల కథ అందరికీ తెలుసు. వీళ్లొస్తే మళ్లీ రాత్రి పూట పొలాల కాడ్నే కాపలా కాయాల్సి వస్తది. నాకున్న నాలుగెకరాల్లో వరి, పత్తి వేసిన. ఇగ కాంగ్రెసోళ్లు చెప్పినట్లు మూడు గంటల కరెంటిస్తే తెగ ఇబ్బందైతది. గిప్పుడిప్పుడే రైతులు కడుపు నిండా బువ్వ తింటున్నరు. హస్తం పార్టీ వాళ్లు వచ్చి మళ్లీ ఆగం చేస్తమంటున్నరు. అయినా, కాంగ్రెసోళ్లు గెలిచేది లేదు. సచ్చేది లేదు. ఫ్రీ కరెంట్ ఇయ్యరు. ఉన్న మోటర్లకు మీటర్లు పెడుతరు. వీళ్లను ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరు. మూడు గంటల కరెంట్‌తో రైతులకు మళ్లీ పాత కరెంట్ కష్టాలు వచ్చినట్లే. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వడంతో రైతులు సంతోషంగా జీవిస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో సమయానికి కరెంట్ లేక పంటలు ఎండిపోయి, రైతులు చాలా నష్టపోయారు. గతంలో రాత్రి పూట పొలం కాడే పడుకునేటోళ్లు. కాంగ్రెస్ పాలన మాకొద్దు.. కేసీఆర్ సారు ఇస్తున్న 24 గంటల కరెంటు ముద్దు. కాంగ్రెస్ గ్యారెంటీలపై నమ్మకం లేదు. కర్ణాటక రైతులు పడుతున్న బాధలు మాకొద్దు. రేవంత్‌రెడ్డికి రైతులపై అవగాహన లేదు. 10 హెచ్‌పీ మోటర్లు, 3 గంటల కరెంట్‌తో ఎవుసం ఎట్లా చేస్తం. వాళ్లు చెప్పినట్లు పెద్ద మోటర్లు పెడితే ఎంత కరెంట్ బిల్లు వస్తది. ఎట్లా కట్టాలే. మోటర్ కొనడానికి పైసలెవరు ఇస్తరు.



గీళ్లు ఎప్పుడైనా ఎవుసం చేసింండ్రా..? 24 గంటల కరెంట్ ఇస్తేనే వీలైన సమయంలో పంటలకు నీరు పెడ్తున్నం. అప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ల మీద భారం పడదు. సీఎం కేసీఆర్ ఏం చేసినా ఆలోచించే చేస్తరు. కాంగ్రెసోళ్లను నమ్మితే నట్టేట మునుగుడే. వాళ్లు ఢిల్లీ లీడర్లకు గులాంలు. తెలంగాణోళ్లకు ఏడ న్యాయం చేస్తరు. మేం అయితే కేసీఆర్ కే జై కొడుతం. ఆయనుంటేనే పంటలు మంచిగా పండుతయ్. మా కుటుంబం అంతా సీఎం కేసీఆర్ వెంటే ఉంటాం.

**- శశికాంత్‌రెడ్డి, రైతు, పెద్దరేవల్లి గ్రామం, బాలానగర్ మండలం**

## రైతులు బిచ్చం ఎత్తుకోవాల్సి వస్తది..



మూడు గంటల కరెంట్ ఇస్తే నీళ్లు పారవు.. పంట పండదు. అలా అయితే రైతులు బిచ్చం ఎత్తుకోవాల్సి వస్తుంది. ఇంతకుముందు కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పుడు 7 గంటలు, 6 గంటలు అని చెప్పి రెండు, మూడు గంటలే ఇస్తుండ్రి. దీంతో పంటలు మంచి పండకుండె. తెచ్చిన అప్పులు కట్టేందుకు ఇజ్జత్ కోసం ఉన్న భూములను కూడా అమ్మిన సందర్భాలు ఉన్నాయి. నాడు రూ.10 వేలకు ఎకరా పొలం అమ్మేవారు. ఇప్పుడా రైతులు అగ్గువకు అమ్ముకున్నామని బాధపడుతున్నారు. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత అంతా మంచిగ చేస్తున్నాడు. రైతులు సాగునీళ్లు ఇచ్చి కరెంటు సమస్యలే లేకుండా చేసిండు. అంతేకాక పెట్టుబడికి సాయం అందిస్తున్నాడు. రైతులు ఇప్పుడు ఎవరు కూడా వ్యవసాయం కోసం అప్పులు చేయడం లేదు. ఎవరైనా చేసినా బాకీలు కట్టడానికి మాత్రం భూములు అమ్ముకునే పరిస్థితి లేదు. భూముల ధరలు చాలా పెరిగాయి. నాడు తిప్పలు పడ్డ రైతులు ఇప్పుడు సంతోషంగా ఉన్నారంటే అది కేవలం కేసీఆర్ సార్ వల్లే. మంచి చేయాలంటే చాలా కష్టపడాల్సి వస్తది. చెడగొట్టాలంటే ఒక్క నిమిషం కాదు. మార్పు కావాలని ఓటును పక్కకు వేస్తే తినే అన్నంను కాళ్లతో తన్నినట్లే అయితది. మళ్లీ రైతులు పాత కష్టాలే పడాల్సి వస్తది.

**- నాగ్యానాయక్, రైతు తిమ్మాయిపల్లి తండా, అడ్డాకుల మండలం**


## చెప్పులరిగేలా తిరగాల్సి వస్తది..



రాష్ట్రంలో ధరణి పోర్టల్ ఉండడంవల్లే రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన సేవలు అందుతున్నాయి. ధరణి రద్దు చేస్తే రాష్ట్రంలో మళ్లీ భూ సమస్యలు ప్రారంభమవుతాయి. కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వస్తే ధరణిని తీసి బంగాళాఖాతంలో పడేస్తాం అంటున్నారు. అసలు ఆ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదు సచ్చేది లేదు. మర్చిపోయి పొరపాటున కూడా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మళ్లీ రైతులు తాసీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లకు చెప్పులరిగేలా తిరగాల్సి వస్తుంది. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ భూములను కబ్జా చేసుకోవడానికే ధరణిని రద్దు చేస్తామంటున్నారు. గతంలో వ్యవసాయ భూముల పట్టా కోసం రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి అలిసిపోయేవారు. ఇప్పుడు ధరణితో ఒక్క రోజుల్లోనే రైతులకు భూమి రిజిస్ట్రేషన్ అయిపోతుంది. ఎటువంటి దళారులను ఆశ్రయించాల్సిన పని లేకుండా పోయింది. ధరణి ఉండటంతో భూముల లెక్కలు తెలుస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తున్న రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమ అవుతున్నాయి. రైతులకు ఇంత సేవ చేస్తున్న సీఎం కేసీఆర్ వెంటే మా రైతులందరం ఉంటాం.

**- సిరాజుద్దీన్, రైతు, కోయిలకొండ మండలం, నారాయణపేట జిల్లా**

# భూములు ఆగమైతయ్



- ధరణిపై కాంగ్రెస్ నేతల కడుపుమంట
- పట్వారీల వ్యవస్థ తెస్తామంటూ ప్రచారం
- మళ్లా భూ పంచాయితీలే అంటూ రైతుల నిట్టూర్పు
- హస్తం పార్టీ నేతలకు ఎవుసం తెలుసా అంటూ కర్షకుల్లో పెల్లుబికిన ఆగ్రహం

## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

## కాంగ్రెస్సోళ్ల మాటలు నమ్మితే ఇగ అంతే..



కాంగ్రెస్సోళ్లు చెబుతున్న మూడు గంటల కరెంట్‌తో ఎవుసం చేయలేం. వాళ్ల మాటలు నమ్మితే భూములు బీడు పెట్టుకోవాల్సిందే. అప్పట్ల వాళ్ల పాలనలో అష్టకష్టాలు పడ్డం. ఎవుసం చేయడమంటేనే భయపడేటట్లు చేసింండ్రు. కరెంటియ్యక, నీళ్లియ్యక నరకం చూపింండ్రు. ఎరువుల కోసం షాపుల కాడ తెల్లవార్లు లైన్ కట్టుకొని నిలబడేవాళ్లం. పోలీసులను పెట్టి కొట్టిపిచ్చింండ్రు. అప్పుసొప్పు చేసి అష్టకష్టాలు పడి పంట పండిస్తే.. సక్కగ కొనేటోళ్లు కూడా ఉండకుండ్రి. ధర కూడా అంతంత మాత్రమే ఇస్తుండ్రి. ఇప్పుడేమో రైతుల బాధలన్నీ పోయినయి. 24 గంటలు ఉచితంగా కరెంట్ ఇస్తున్నారు. చెరువులు, కుంటలు, కాల్వలు యాడ చూసినా నీళ్లే పారుతున్నాయి. బోర్లళ్ల కూడా నీళ్లు బాగా ఊరుతున్నాయి. ఎరువుల కోసం లైన్ల నిలబడే కష్టమే లేదు. భూమి లెక్క ప్రకారం ఎవ్వరికెన్నీ ఎకరాల్లో అన్నే బస్తాలు ఎప్పుడన్నా తీసుకోవచ్చు. పెట్టుబడి కోసం ఎవ్వరి కాళ్లు మొక్కకుండా సర్కారే రైతుబంధుతో పెట్టుబడి సాయం అందిస్తున్నది. పండించిన పంట దళారుల పాలుకాకుండా కల్లాల్లోనే కాంటాలు పెట్టి మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే కొంటుంది. ఇంతకంటే రైతులకు ఇంకేం కావాలి. అప్పుడు పట్టించుకోని కాంగ్రెస్సోళ్లు ఇప్పుడు ఎట్లా పట్టించుకుంటారు. మూడు గంటల కరెంట్‌తో మూడు మడ్లు కూడా తడవవు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమంటే ఇప్పటికిప్పుడు ఎట్లా తెచ్చుకుంటాం. అది అయ్యేపని కూడా కాదు. కాల్వ మీద అందరూ అదే పెడితే కరెంట్ ఎంత కాల్తది. లోడ్ ఎంత పడ్తది. లేనిపోని నెత్తినొప్పి కొనితెచ్చుకున్నట్లయితది. కేసీఆర్ పాలనలో రైతులకు గౌరవం పెరిగింది. రైతుల అభివృద్ధి కోసం మంచి పనులు చేసిండు. రైతుబంధుతో రైతులను ఆదుకుండు. రైతుబీమాతో కుటుంబాలకు భరోసా కల్పించిండు. ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయమంటే వేయం. మాకు కేసీఆరే బాగున్నాడు.

**- కంపిలి మల్లప్ప, రైతు, కోటకదిర, మహబూబ్‌నగర్ రూరల్ మండలం**

## ఏరికోరి బాధలు తెచ్చుకోవద్దు..



గతంలో నీళ్లు, కరెంట్ లేక చాలా ఇబ్బందులుపడ్డాం. ఆ విషయం అందరికీ తెలుసు. కరువు వచ్చినప్పుడు ఏ పార్టీ వాళ్లు వచ్చి ఆదుకోలేదు. తెలంగాణ వచ్చిన తరువాతనే నీళ్లు వచ్చినయ్. రాత్రిపూట పొలాలకు నీరు పారబెట్టుకునేందుకు పోతే ఇంటికి వస్తామో.. రామో.. తెలియని పరిస్థితి ఉండేది. సీఎం కేసీఆర్ అనుకున్నది సాధించిండు. ఏ రాష్ట్రంలో లేని విధంగా 24 గంటల ఉచిత కరెంట్, రైతుబంధు ఇస్తుంటే కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తున్నది. ఎరువులు అందుబాటులో ఉంచి పంటలకు మద్దతు ధర ఇస్తున్నారు. పచ్చగా ఉన్న గ్రామాల్లో రేవంత్‌రెడ్డి మళ్లీ చిచ్చు పెట్టాలని చూస్తుండు. నిరంతర కరెంట్ ఇవ్వాలన్న సోయి వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు రాలేదు.. పక్కనే ఉన్న కర్ణాటకలో ఎందుకు ఇవ్వడం లేదు. మాయ మాటలు చెప్పడానికి వస్తున్నారు. ప్రజలు, రైతులు జాగ్రత్తగా ఉండాలి. ఏరికోరి మళ్లా ఆ బాధలు తెచ్చుకోవద్దు.

**- బొట్టు లక్ష్మణ్‌నాయక్, రైతు, మిడ్జిల్**

## దోపిడీ రాజ్యం తెచ్చేందుకే కుట్ర..



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని తీసేస్తరట. అదే గనుక జరిగితే మళ్లీ దళారి రాజ్యం వస్తుంది. ధరణి లేకుంటే భూ రికార్డుల్లో రైతుల వివరాలను ఇష్టమొచ్చినట్లుగా నమోదు చేస్తారు. భూతగాదాలు రోజురోజుకూ ఎక్కువైతాయి. సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ ప్రవేశపెట్టిన తరువాత రైతులకు భూములపై భరోసా ఏర్పడింది. పొరపాటున కూడా కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దు. రైతులకు మేలు చేసిన బీఆర్ఎస్‌కు అండగా నిలవాలి. 24 గంటల కరెంట్‌తోపాటు పుష్కలంగా సాగునీరందిస్తుండడంతో భూములను బీడు పెట్టకుండా సాగు చేస్తున్నారు. రైతుబంధు పడడంతో వ్యవసాయంపై రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ధరణి వచ్చిన తరువాత మండల కార్యాలయంలో గంటలోనే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత భూముల రేట్లు పెరిగిపోయాయి. ధరణితో రైతుబంధు, రైతుబీమా వస్తున్నది. ధరణి పోతే రైతులకు మళ్లీ తిప్పలు తప్పవు. కాంగ్రెస్ నాయకుల మాయమాటలకు మోసపోతే గోస తప్పదు. ధరణి రద్దు చేస్తే రైతులు తిరుగబడుతారు.

**- బాలయ్య, హన్వాడ మండలం, నారాయణపేట జిల్లా**

## దళారుల కోసం తీసేస్తమంటున్నారు..



కాంగ్రెస్ నాయకులు దళారుల రాజ్యం తీసుకొచ్చేందుకే ధరణి పోర్టల్‌ను తీసేస్తమంటున్నారు. అదే జరిగితే రైతుల బతుకులు మళ్లీ అంధకారంలోకి పోతాయి. రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకొచ్చిన తరువాత రైతులు తాసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగే పని లేకుండా పోయింది. గతంలో ఎకరం పొలం కొన్నా వారి పేర చేసుకునేందుకు చెప్పులరిగేలా తిరిగినా పని జరిగేది కాదు. లంచాలు ఇచ్చి.. రోజుల తరబడి అదే పని పెట్టుకుంటే రిజిస్ట్రేషన్ జరిగేది. బీఆర్ఎస్ సర్కారు వచ్చాక ఇప్పుడు పట్వారీతో పనిలేదు. ఖర్చులు, శ్రమ లేకుండా ఒక్కరోజే పట్టాదారు పాసుబుక్కులు తీసుకుంటున్నాం. ధరణి పోర్టల్‌తో రైతులకు ప్రభుత్వం నుంచి సంక్షేమ ఫలాలు నేరుగా అందుతున్నాయి. దురదృవశాత్తు రైతు మరణిస్తే రైతుబీమా సొమ్ము నామినీ ఖాతాలో జమచేస్తున్నారు. ధరణి పోర్టల్ తీసి దళారీ వ్యవస్థను పెంచిపోషించేందుకు కాంగ్రెస్ నాయకులు కంకణం కట్టుకున్నారు. ధరణి పోర్టల్ ఉంటేనే మేలు జరుగుతుంది. రైతుల కోసం పని చేసే బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇచ్చి కారు గుర్తును గెలిపించుకోవాలి.

**- శ్రీశైలం, రైతు, కుచ్చర్‌కల్ గ్రామం, రాజాపూర్ మండలం**

## అప్పట్లో వీఆర్‌వోలదే రాజ్యం..




కేసీఆర్ ప్రభుత్వం ధరణి పోర్టల్ ప్రారంభించకముందు.. పటేల్, పట్వారీ పాతుకుపోయింది.. వీఆర్‌వోల ఇంటి దగ్గరనే పహణీ రికార్డులు ఉండేవి.. వీఆర్‌వోల ఇంటి చుట్టూ రాత్రి వరకు ప్రజలు తిరగాల్సి వస్తుండే.. పటేల్ పట్వారీ, రెవెన్యూ వ్యవస్థలో అక్రమాలు, అన్యాయాలు, నిలువెత్తు దోపీడికి ఎంతో మంది బలయ్యారు. దళారులకు డబ్బులు ముట్టించే వారిదే పై చేయిగా ఉండేది. దీంతో సొంత అన్నదమ్ములకు పంచాయితీలు జరిగేది.. పోలీస్ స్టేషన్, కోర్టు, జైళ్ల పాలు అయ్యేవారు. వీఆర్‌వోలు రాసిందే రాత, గీసిందే గీతగా నమోదయ్యేది. వాళ్లు ఆడిందే ఆట.. పాడిందే పాటగా ఉండేది. ఒక వ్యక్తి వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి పొందాలంటే సవాలక్ష ఇబ్బందులు ఉండేవి. డాక్యుమెంట్ రైటర్ నుంచి ప్రతి ఒక్కరి చేతులు తడపాల్సి వచ్చేది. చేతిలో పాస్‌బుక్ ఉన్నప్పటికీ మరొకరి పేరుతో పాసుబుక్ అక్రమంగా తయారు చేసుకొని బ్యాంకులో లోన్లు కూడా తీసుకునేవారు. ధరణి పోర్టల్ ప్రారంభించిన తర్వాత దోపీడి విధానాలు తగ్గిపోయాయి. ప్రశాంతంగా ఉన్న రైతుల కంట్లో పోసే పార్టీకి కాకుండా.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కేసీఆర్ పార్టీ కారు గుర్తుకే మనందరం ఓటేయ్యాలి. **- మల్లారెడ్డి, రైతు, వర్కూరు గ్రామం, మాగనూరు మండలం**

## రైతుల నోట్లో మట్టే..

రెవెన్యూ విభాగంలో పట్వారీతనం అమల్లోకి వస్తే రైతుల నోట్లో మట్టి పడడంతోపాటు భూముల సమస్యలు పెరిగిపోయి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. భూ పంచాయితీలు కుప్పలు కుప్పలుగా పేరిపోవడంతో సీఎం కేసీఆర్ పట్వారీ వ్యవస్థను రూపుమాపి ధరణి పోర్టల్ తీసుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్ తీసేసి రైతుల బతుకులను చీకట్లోకి నెట్టేందుకు ప్రయత్నిస్తున్నది. ధరణి పోయి పట్వారీవ్యవస్థ వస్తే దళారులు రాజ్యమేలుతారు. గతంలో అన్నీ సక్రమంగా ఉండి విరాసత్ చేయించుకోవాలన్నా.. పట్వారీలకు వేలకు వేల రూపాయలను అప్పజెప్పాల్సి వచ్చేది. అప్పటికీ విరాసత్ అవుతుందన్న నమ్మకం ఉండేది కాదు. కాళ్లరిగేలా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగితే తప్పా పనులు చేసేవారు కాదు. ఇప్పుడు విరాసత్ చేసకునేవాళ్ల మీ సేవకు వెళ్లి స్లాట్ బుక్ చేసుకుంటే ఎలాంటి ఇబ్బందులు లేకుండా పని జరుగుతున్నది. నేడు రైతులంతా ఎలాంటి చీకు చింత లేకుండా హాయిగా బతుకుతున్నారు. మాలాంటి వారి కోసం అహర్నిశలు పాటుపడుతున్న సీఎం కేసీఆర్ వెంటే తామంతా ఉంటాం.

**- రాఘవేందర్‌రెడ్డి, రైతు, భూత్పూర్ గ్రామం, మక్తల్ మండలం**



# మూడుగంటలిస్తే మునుగుడే..

- రైతు బాగుపడుతుంటే కాంగ్రెస్‌కు కండ్లమంట
- రేవంత్ నోట మూడు గంటల కరెంట్ మాట
- 10 హెచ్‌పీ మోటర్లు సరిపోతాయని అబద్ధాలు
- వ్యవసాయాన్ని భ్రష్టు పట్టించేలా హస్తం యత్నం
- ఓటుతో బుద్ధి చెబుతామంటున్న కర్షకులు

## కరెంట్ కష్టాలు మళ్లీ వద్దు..



కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కరెంట్ ఎప్పుడు వస్తుండెనో.. ఎప్పుడు పోతుండెనో తెలిసేది కాదు. పంటలు వేయలంటేనే భయపడేవాళ్లం. రాత్రిపూట కరెంట్ కోసం పొలాల వద్ద పడుకునేటోళ్లం. మళ్లా ఇప్పుడు వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలని, రైతులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి అంటున్నడు. అసలు వ్యవసాయం గురించి వాళ్లకు ఏం తెలుసు.. నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. 10 హెచ్‌పీ మోటర్లు వాడితే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. మళ్లా కరెంట్ కష్టాలు మొదలై రైతు ఆగమయ్యే ప్రమాదముంది. కాంగ్రెసోళ్లు వద్దు.. వాళ్ల కరెంట్ వద్దు.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినంక కరెంట్ బాధలన్నీ పోయినయ్. పొద్దున పూటనే పొలాలకు నీళ్లు పారించుకుంటున్నాం. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతున్నాం. రైతులు ఆలోచించి బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా నిలవాలి. 3 గంటలు కరెంట్ ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీని బొందపెట్టాలి.

**- ఈశ్వరయ్య, రైతు, మిడ్జిల్**

## కాంగ్రెసోళ్లను ఎవరూ నమ్మరు..

తెలంగాణ రాక ముందు సమైక్య పాలనలో వ్యవసాయం అస్తవ్యస్తంగా ఉండేది. కాంగ్రెస్ గవర్నమెంట్ ఉన్నప్పుడు కరెంటు ఎప్పుడు వస్తదో పోతదో తెలియకపోయేది. కరెంటు కోసం తిండి తిప్పలు మానుకొని పొలం వద్ద పడిగాపులు కాసేవాళ్లం. వచ్చే కరెంటు కూడా లో ఓల్టేజీ ఉండేది. బోరు మోటర్లు నడవక చెడిపోయేవి. కరెంటు కోసం చాలా తిప్పలయ్యేది. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ సారు 24 గంటల కరెంటు ఇస్తున్నడు. దీంతో పంటకు ఎప్పుడంటే అప్పుడు నీళ్లు పారించుకుంటున్నాం. పంటలు పుష్కలంగా పండుతున్నాయి. మంచి ధరలొస్తున్నాయి.. గిప్పుడిప్పుడే జర సంతోషంగా ఉన్నాం. కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంటు ఇస్తమంటున్నారు. నాకున్న 10 ఎకరాల పొలానికి మూడు గంటల కరెంటు ఏ మూలకూ సరిపోదు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి ఓట్లు వేస్తే మళ్లీ కరెంటు కోతలే ఉంటాయి. కాంగ్రెసోళ్ల సంగతి రైతులందరికీ ఎరుకనే.. వారిని ఎవరూ నమ్మరు. వ్యవసాయం గురించి తెలిసిన సీఎం కేసీఆర్‌నే మళ్లీ గెలిపించుకోవాలి.. ఉదండాపూర్ రిజర్వాయర్‌ను నింపి చుట్టు పక్కల పొలాలకు సాగునీళ్లు ఇస్తడు. మా గ్రామంలో వ్యవసాయం పండగ అయితది.

**- పెద్ద నర్సింహులు, రైతు, చిన్నపల్లి గ్రామం, జడ్చర్ల మండలం**



## మళ్లీ కరెంట్ కష్టాలు తప్పవు..

గతంలో ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించిన ప్రభుత్వాలు వ్యవసాయానికి 7 గంటల కరెంటిచ్చేవారు. ఉదయం 3 గంటలు, రాత్రి 4 గంటలు మాత్రమే ఉండేది. అది కూడా సక్రమంగా ఇయ్యకపోయేది. అందుకే కరెంటు వస్తదని చెప్పి పగలు, రాత్రి తేడా లేకుండా బావులు, బోర్ల కాడ ఉంటుంటిమి. కరెంట్ వచ్చిపోతుంటే పారిన మడులే మళ్లీ, మళ్లీ తడిసేవి. అయితే తెలంగాణ వచ్చినంక కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక మాకు శానా మేలు జరిగింది. ఆయన వ్యవసాయానికి వెన్నెముకగా నిలిచాడు. 24 గంటల పాటు విద్యుత్ ఇస్తున్నడు. ఇప్పుడు మేం పగటిపూట పంటకు నీళ్లు పెట్టుకొని రాత్రి పూట ప్రశాంతంగా ఇంటికాడ పండుకుంటున్నం. నిరంతరం కరెంట్ ఉండడంతో సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. లో ఓల్టేజీ సమస్య లేనందున ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోతలేవు. కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంటిస్తే మళ్లీ రైతు అర్ధెకర, ఎకరా కూడా సాగు చేయలేడు. వీరి అధికారంలోకి వస్తే మాత్రం రైతులు మళ్లీ వలసెళ్లక తప్పదు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి వ్యవసాయంపై అవగాహన లేక ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడు. మూడు గంటల కరెంట్ ఇస్తే ఎన్ని ఎకరాల భూమి పారుతుందో ఆయనకు తెలియదు. కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తే రైతులకు కరెంట్ కష్టాలు తప్పవు. మోసకారి కాంగ్రెస్‌ను తరిమికొడుతాం. రైతులపై కపట ప్రేమ చూపిస్తున్న కాంగ్రెస్‌ను నమ్మరు. రైతులంతా బీఆర్ఎస్ వైపే ఉన్నాం. కాంగ్రెస్ కష్టాలు మాకు వద్దు. కేసీఆర్ సర్కారే మాకు ముద్దు..

**- రాకేశ్ రెడ్డి, రైతు, కన్మనూర్ గ్రామం, మరికల్ మండలం**

